'స్వాతి' వారపత్రిక - 22.10.2004

# ఆడతోడు

సమయం ఉదయం పది గంటలు. వాతావరణం ఆహ్లాదకరం. స్థలం విశాఖపట్నం పొలిమేరలో. ఒక వీధిలో ఇరుకు ఇరుకు సందులో ఒక సాదాసీదా మధ్య తరగతి నాలుగు గోడల మధ్య....

రేవతి అంటున్నది సూర్యంతో - "ఒరే తమ్ముడూ. మనం ఈ రోజు మధ్యాహ్నం పెళ్ళి చూపులకి వెళ్ళబోతున్నాం. నీ గెడ్డం ఏమీ బాగోలేదు. తీసేయ్"

"నా గెడ్డం నాకు బాగుంది. తీయను" అన్నాడతను.

"ఎందుకు తీయవు? అలా గెడ్డం పెంచేసి ఒక ఠాగూర్ లేదా టాల్‌స్టాయ్ అయిపోదా మనుకుంటున్నావా?"

"పూచిన పూలన్నీ కాయలైపోవు. పెరిగే గెడ్డాలన్నీ ఠాగూర్‌లై పోరు" అన్నాడు శాంతారామ్.

అతను రేవతికి మొగుడు.

"ఠాగూర్ సినిమాలో అసలు చిరంజీవికి గెడ్డం ఎక్కడ వుంది?" అని సందేహం వెలిబుచ్చేడు చిచ్చర పిడుగు అర్జున్ - రేవతి ఆరేళ్ళ కొడుకు.

"ఒరేబాబూ! మనకి ఇద్దరు ఠాగూర్‌లు ఉన్నార్రా! మీ మావయ్య గెడ్డం పెంచి రవీంద్రనాథ్ ఠాగూర్ కాలేడు. గెడ్డం గీకి మెగాస్టార్‌లో వందోవంతు కూడా కాలేడు" అన్నాడు కొడుకు అర్జున్‌తో శాంతారామ్. అతడు గెడ్డం పెరగనివ్వడు. ప్రతి రోజూ ఉదయం అదొకపనిగా పెట్టుకొని మీసంతో సహా గెడ్డం గీకిపారేస్తాడు. లేకుంటే రేవతి రాత్రులు దగ్గరకు రానివ్వదని భయం.

"బావా! మీరంతా నాపై, నా గెడ్డంపై అనవసరంగా అధికప్రసంగం చేస్తున్నారు. ఇటీజ్ టూ మచ్. అసలు గెడ్డం గురించి మీకేం తెలుసు? గెడ్డం ఈజ్ నేటి యువతరం లేటెస్ట్ ఫ్యాషన్. మాసిన గెడ్డం, చిరుచిరు గెడ్డం. సినిమాలు చూస్తున్నారు కదా మీరు, ఏ కుర్ర హీరో అయినా గెడ్డం లేకుండా నటించగా మీరు చూసేరా? అంచేత దయచేసి నా గెడ్డం జోలికి రాకండి ప్లీజ్!" అని శాంతారామ్‌తో ఆవేశంగా అన్నాడు సూర్యం.

"ఒరే సూర్యం. నేను నీకన్నా మొండిదాన్ని. నీవు గెడ్డం గీయకపోతే నీతో పెళ్ళిచూపులకి విజయనగరం వచ్చేది లేదు. నీ గెడ్డంతో బాటు మీ బావని కూడా తీసుకొని వెళ్ళు. నేను రాను" అని తేల్చేసింది రేవతి.

అక్క లేకుండా ఒక్క బావతో విజయనగరం వెళ్ళడం స్త్రీ పాత్రలేని నాటికలా బోడిగా, చీదరగా ఉంటుంది! అక్క రాకుంటే ఎట్లా?

సూర్యంకి రేవతి అక్క మాత్రమే కాదు. తల్లీ తండ్రీ కూడా. తల్లిదండ్రులు అకాల మరణం

చెందినా, వారు లేరన్న దిగులు లేకుండా తమ్ముడిని చూసుకుంటోంది. ఇంతకీ రేవతి వయసు ముప్ఫయి మూడే! సూర్యంది టీనేజ్ వయసు కాదు. ఆమె కన్నా మూడేళ్ళు చిన్న.

పెళ్ళిచూపుల ప్రయాణానికి తన గెడ్డం ఒక సమస్యగా మారుతుందని ఏమాత్రం ఊహించలేదు సూర్యం. ఒక పక్క ప్రియమైన గెడ్డం, మరో పక్క ప్రియమైన అక్క. చివరికి అక్క కోసం తన ప్రియమైన గెడ్డాన్ని త్యాగం చేయక తప్పలేదు సూర్యంకి.

"గెడ్డమూ, త్యాగమూ గాడిద గుడ్డూనూ" అని తేలిగ్గా తీసిపారేశాడు శాంతారామ్.

"సూర్యం! నీవు ది గ్రేట్ గెడ్డం సహకారంతో ఒక ఐశ్వర్యారాయ్‌ని కాదు కనీసం ఒక నడ్డిదాన్ని గుడ్డిదాన్ని కూడా లవ్ చేయలేకపోయావ్. నీ గెడ్డానికీ, నీకూ అంత సీనే వుంటే ఇదిగో ఈ పెళ్ళి చూపులనే పాత పుస్తకాన్ని దులిపి దాని జోలికి వెళ్ళే అవసరం వచ్చేది కాదు గదా మనకి" అని ఎత్తిపొడిచేడు.

బావ నవ్వుతానే ఆ మాటలు అన్నప్పటికీ తనని ఇన్సెల్ట్ చేసినట్టుగా భావించేడు సూర్యం. అతని గుండె గాయమయ్యింది. దీనికో ఫ్లాష్‌బ్యాక్ ఉంది.

ఆ రోజు సూర్యం పుట్టిన రోజు. తమ్ముడికి రేవతి కొత్త డ్రెస్సు కొని, పెద్ద కేక్ కోయించి, తలపై అక్షింతలు జల్లి నిండుమనసుతో దీవించబోతుంటే అప్పటికే సూర్యం అక్క కాళ్ళపై పడిపోయి బావురుమన్నాడు.

"అక్కా! నీకిది న్యాయమేనా? అర్జున్‌లా నన్ను కూడా ఒక కొడుకులా చూస్తున్నావు. కాదనటం లేదు. కాని నీ తమ్ముడు చిన్నవాడు కాదు. వయసు వరదలో ముప్ఫై ఏళ్ళు ముంచుకొచ్చేసి ఆడతోడు కోసం పరితపిస్తూ ఊపిరాడక గిలగిల కొట్టుకుపోతున్న వాడికి పెళ్ళాం అవసరం వుందని ఏనాడైనా ఆలోచించావా? నాకీపాటికి పెళ్ళై వుంటే అర్జున్‌కి ఒక పెళ్ళాం కూడా పుట్టేసి ఉండేది కదా! వెన్నెల వేడి లాంటి నా యవ్వనకాలాన్ని ధ్వంసం చేసి నాది ఎడారి బతుకు చేసినందుకు నిన్ను ఆ భగవంతుడు కూడా క్షమించండక్కా క్షమించడు. అదే అమ్మా నాన్నా బతికుంటే నాకీ గతి పట్టి ఉండేదా! నేనూ పెళ్ళాం పిల్లలతో నీలా హాయిగా ఉందును కదా. ఇప్పటికైనా మీరు కళ్ళు తెరిచి నాకు ఒక ఆడతోడు చూడండి. నాకు వెంటనే పెళ్ళి చేసేయండి."

రేవతి చాలాసేపు బొమ్మలా కొయ్యబారిపోయింది. తర్వాత వెక్కి వెక్కి ఏడ్చేసింది.

"ఒరే తమ్ముడూ! పుట్టిన రోజు నాడు నీవు ఏడ్వకూడదు. నన్ను ఏడిపించకూడదురా! ఒరే నీకు దండం పెడతాను. దయచేసి నన్ను నిందించకురా! నీవు పెళ్ళాం కోసం ఇంత తొందరపడ్తున్నావనే విషయం నేను గ్రహించలేకపోయేనురా. నీవు నిన్న మొన్నటి వరకూ నిరుద్యోగివే కదా! రెండేళ్ళ క్రిందటే కదా గుమస్తా ఉద్యోగం వచ్చింది. నీకు పెళ్ళి సంబంధాలు చూడడం లేదంటే ఒప్పుకోను. కాని చూడడంలో సీరియస్‌నెస్ కాస్త లోపించిందనే విషయం ఒప్పుకుంటాను. ఏమైనా తమ్ముడూ! మాది తప్పేరా. ఈ రోజు నుంచి మీ బావని సెలవు పెట్టేసి మరీ నీకు పెళ్ళి సంబంధాలు చూసే పని మీద వుండమని చెబుతానురా. సరేనా."

"అయ్యో! బావ నాకు పిల్లని చూస్తాడా? నాకా నమ్మకంలేదక్కా... బజారుకు వెళ్తే బావ

ఏనాడయినా ఒక్కసారైనా పుచ్చులు కాకుండా తాజా వంకాయలు తెచ్చాడా? ఈయనొచ్చి నాకు పిల్లని చూస్తాడా" అన్నాడు.

అంతవరకూ అసహనంగా కూర్చున్న శాంతారామ్ ఘాటుగా రివర్స్ ఇచ్చేశాడతనికి.

"సూర్యం! నేనెందుకయ్యా పెళ్లిళ్ళ పేరయ్యలా నీకు సంబంధం చూడాలి. నేను తాజా వంకాయలు లేకపోతే మీ అక్క నిందించవచ్చు. ఒప్పుకుంటాను. అర్జున్‌కి స్కూల్లో సీటు సంపాదించలేకపోతే మీ అక్క నిందించవచ్చు. ఒప్పుకుంటాను.

కాని బామ్మర్దికి పిల్లని తీసుకురాకపోతే నిందించే హక్కు ఆ భగవంతుడిక్కూడా లేదంటాను. నీవు అడ్డగాడిదలా ఎదిగిపోయేవు గనుక నేను నీకు పిల్లను చూసి నీ పక్కన పడుకోబెట్టాలా! ఏమయినా అర్థముందా? నా గురించి ఏమనుకుంటున్నావు? నేను బ్రోకర్‌నా?

"సరేనయ్యా. నీకు ఆడతోడు కావాలి. బాగుంది. ఐతే నీక్కావల్సిన ఆడదాన్ని నీవే వెదుక్కో. నాలుగు షాపుల్లోకి వెళ్ళి నీకు నచ్చిన చొక్కా కొనుక్కుంటున్నావు. నీ కిష్టమైన పుస్తకం కొనుక్కుంటున్నావు. అలాగే నీకు నచ్చిన అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకోలేవూ?

"నీవు సినిమాలు చూస్తుంటావు కదా. ఏ ఒక్క హీరో అయిన తల్లీతండ్రి బుద్ధిగా కుదిర్చిన అమ్మాయిని చేసుకున్నాడా పెళ్లి! చదువు సంధ్యా లేకుండా పరమ బేవార్సుగా రోడ్లంబడి తిరుగుతూ తెలుగింటి అప్సరసలను సైతం 'ఐ డోంట్ వాంట్' అన్చెప్పి బాలీవుడ్ ముద్దుగుమ్మలని ప్రేమించి పెళ్ళాడేస్తున్నాడు. నీకేం తెగులు? నీకు అందం వుంది. చదువుంది. ఉద్యోగం వుంది. నీకు తగిన అమ్మాయిని చూసి పెళ్లి చేసుకోలేవూ?

"నీవు డిగ్రీ తెచ్చుకోవడానికి మేము పరీక్షలు రాయలేదు. నీకు ఉద్యోగం రావడానికి మేం ఇంటర్వ్యూకి వెళ్ళలేదు. అవునా! మరి నీకు పెళ్ళి చేయడానికి మేము పిల్లను చూడడం ఏమిటి? నాన్సెన్స్! అర్జున్ చాక్లెట్ల కోసం ఏడ్చినట్లు పెళ్ళాం కావాలని మామీద పడిపోయి ఏడ్వకు. అర్థమయిందా. నీవు రేపే ఒక అమ్మాయిని ప్రేమించి తీసుకురా. ఘనంగా మేము పెళ్ళి జరిపించేస్తాం."

సూర్యంలో ఒక ఉత్తేజం. ఉద్వేగం. అయినా - "అక్కా! విన్నావా. బావ సందేశం. లవ్ మ్యారేజ్‌లో మీకు ఇబ్బంది కలిగించేది కులం ప్రోబ్లెమ్. తర్వాత మీ యిష్టం."

"నో ప్రాబ్లమ్ తమ్ముడూ, కులమూ వద్దు, కట్నమూ వద్దు. పిల్లని ప్రేమించడం నీ వంతు. పెళ్ళి చేయడం మా వంతు" అంది రేవతి నవ్వుతూ.

"థాంక్యూ! మీ ఇద్దరికీ ఇంతటి విశాల భావాలున్నాయని నేననుకోలేదు. అయినా ఇటీజ్ టూ లేట్. ఈ సందేశం, సలహా ముందే ఇవ్వాల్సింది నాకు"

"నో ప్రాబ్లెమ్. బెటర్ లేట్ దాన్ నెవర్. ఈ రోజే జనారణ్యంలో నీ ప్రేమ వేట మొదలెట్టు. కమాన్ గో ఎ హెడ్" - శాంతారామ్ ప్రోత్సాహం.

"ఆల్ ది బెస్ట్" రేవతి దీవెన.

ఇక అప్పటినుండి అమ్మాయిల వేటలో పడి ప్రేమ సినిమాలు చూసినవే చూశాడు

చాలాసార్లు. సెలవులు పెట్టి మరీ ఉమెన్స్ కాలేజీల చుట్టూ తిరిగాడు. లేడీస్ హాస్టల్ గేటు వద్ద నిలబడ్డాడు. బస్‌స్టాప్‌లో, బీచ్‌లో, పార్కులో అమ్మాయిలు కనబడిన చోటల్లా బీటు వేశాడు. ఆరు నెలల తర్వాత సూర్యం మళ్ళీ దబ్‌మని రేవతి అక్క పాదాలపై పడి పోయేడు. "అక్కా! నా పెళ్ళి చేసి మీరే పుణ్యం కట్టుకోండి" అన్నాడు.

"పెళ్ళి తప్పక చేస్తాం. సస్పెన్స్‌లో పెట్టక నీ ప్రేయసిని చూపించరా తమ్ముడూ"

"సస్పెన్సూ లేదు. సత్తరకాయా లేదూ. అయినా అక్కా! ఏమిటి మీ ఉద్దేశ్యం? నేనేం పవన్ కల్యాణ్ అనుకున్నారా? ఉదయ్ కిరణ్ అనుకున్నారా! నేను మీకు అలా కనిపిస్తున్నానా? ఈ ఊళ్ళో అమ్మాయిలకి ప్రేమించడం తప్ప మరో పనీపాటు లేదనుకున్నారా?

"బావ నన్ను ఫూల్‌ని చేద్దామని బయటకు తోసేశాడు గాని - అక్కా నీకు ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. ప్రేమించడానికి నా లాంటి సన్నాసులు, వెర్రివెంగళప్పలు పనిచేయరు. టోటల్లీ అయామ్ అన్‌ఫిట్.

"అవునక్కా, ప్రేమించడానికి గట్స్ ఉండాలి. దమ్ము ఉండాలి. ధైర్యం ఉండాలి. తాడో పేడో తేల్చేసే తెగింపు ఉండాలి. పెద్దలనీ, పబ్లిక్‌నీ, పోలీస్‌ని 'ఐడోంట్ కేర్' అనే మొండితనం ఉండాలి.

"ఆ క్వాలిటీస్.. కనీసం ఏ ఒక్కటైనా నాలో లేవు కదా. ఉన్నాయని మీరెలా అనుకొని ప్రేమలో పడిపొమ్మని బయటికి తోసేశారు. దయచేసి బావని నాలాంటి అర్భకులతో ఆడుకోవద్దని చెప్పక్కా. మీరు ఒక అమ్మాయిని చూసి పెళ్ళి చేశారా సరి. లేకుంటే ఇలాగే ఆజన్మబ్రహ్మచారిగా ఉండిపోతాను" అన్నాడు సూర్యం.

"ఒరే తమ్ముడూ! డోంట్‌వర్రీ. నీవు ఒక అమ్మాయిని ప్రేమిస్తేనే హీరోవి లేకుంటే జీరోవి, చేతకాని చవటవి, దద్దమ్మవి, వాజమ్మవీ అని నేననుకోవడం లేదొరేయ్.

"నీవు ఈ అర్నెల్ల ప్రేమ వనవాస ప్రస్థానంలో ఓ ప్రపంచాన్ని చూసేవు. ఆడదంటే ఎవరో, ఏమిటో తెలుసుకున్నావు. ఆడదంటే సినిమా హీరోయిన్ కాదని తెలుసుకున్నావు - చాలు. ప్రేమలేని సినిమా లేదు. జీవితం సినిమా కాదు. నిజజీవితాల్లో ప్రేమ వివాహాలు ఐదు శాతం కూడా అనుమానమే అంటారు. ఆ ఫైవ్ పెర్సంట్‌లో నీవు లేవని నేను బాధపడడం లేదు. అది తెల్సుకోరా బాబు.

"మరోవైపు మా ప్రయత్నాలు మేము చేస్తూనే వున్నాం. నీ కోసం మీ బావ నాలుగైదు సంబంధాలు చూసేడు. అందులో విజయనగరం పిల్ల చాలా బాగుందిరా. పేరు పల్లవి. అందంగా, తెల్లగా, పొడవుగా ఉంది.

"డిగ్రీ చదువుకుందట. ఒరే ఆ పిల్ల నీకు అన్నివిధాలా ఎంచక్కా సరిపోతుందిరా. అన్నట్టు మరిచేను. పల్లవి ఎంచక్కా నృత్యం చేస్తుందిట. నీకు డ్యాన్సు చేసే అమ్మాయిలంటే ఇష్టమని చెప్పేవు. గుర్తుందా? చూసేవా నీకు ఎంతటి చక్కని సంబంధం చూసేనో" అంటూ పల్లవి ఫోటో తీసుకొచ్చి తమ్ముడికి చూపించింది రేవతి.

ఫోటో చూసిన వెంటనే ఎగిరి గంతేశాడు సూర్యం. అతనికి పల్లవి బాగా నచ్చిపోయింది.

అదీ ఫ్లాష్‌బ్యాక్! "నడ్డిదాన్ని గుడ్డిదాన్ని కూడా ప్రేమించలేనంత చవట బామ్మర్ది' అని శాంతారామ్ సూర్యంని ఎగతాళి చేయడానికి జరిగిన విషయం అది!

తర్వాత విజయనగరం పెళ్ళి చూపుల ప్రయాణానికి అడ్డంగా సూర్యం గెడ్డం నిలబడింది. ఆ గెడ్డం తీయకుంటే బయలుదేరనని అన్నది రేవతి. చివరికి సూర్యం అక్క కోసం తన ప్రియమైన గెడ్డాన్ని త్యాగం చేసేడు. నున్నగా షేవ్ చేసుకున్నాడు. రేవతి బయల్దేరింది.

విజయనగరం టాక్సీలో వెళ్దామన్నాడు సూర్యం. "ఎందుకంత డబ్బు పోయడం - వద్దు వద్దు" అన్నది రేవతి. "సరే బస్‌లో వెళ్దాం" అన్నాడు. "అమ్మో! బస్ నాకు పడదు బాబు. కళ్ళు తిరిగి వాంతులవుతాయి. మీ బావ ఇంకేదో అయింది అనుకుంటాడు" అంది.

"అయితే నీవే చెప్పు ఎలా వెళ్దామో" అన్నాడు సూర్యం.

"నీవు పల్లవిని చూడవలసిన ముహూర్తం పగలు రెండు గంటల తర్వాత, సాయంత్రం ఆరు గంటల లోపు. అంచేత మధ్యాహ్నం భోంచేసి, చెన్నై - హవురా మెయిల్ ఎక్కుదాం. గంట లోపుల దిగేస్తాం" అంది రేవతి. సూర్యం కన్నా ముందు అర్జున్ ఒకే చేశాడు. రైలు కదిలే టైముకి సరిగ్గా స్టేషన్‌కి చేరారు. మరో నిమిషంగానీ ఆలస్యమైతే మెయిల్ ఖచ్చితంగా మిస్ అయివుండేది.

అదృష్టం కొలది టికెట్ కౌంటర్ వద్ద పెద్ద క్యూ లేదు. విజయనగరానికి మూడు ఫుల్ టిక్కెట్లు, ఒక హాఫ్ టికెట్ గబగబా తీసింది రేవతి. 'ఇదిగో మెయిల్ కదిలిపోతోంది' అన్నారెవరో. అంతా జనరల్ బోగి ఎక్కేశారు.

'థాంక్‌గాడ్!' అనుకున్నాడు సూర్యం.

కంపార్టుమెంట్ రష్‌గా ఉంది. రేవతి, అర్జున్ ఎలాగోలా కూర్చోగలిగేరు. అర్జున్‌కి ఆనందంగా ఉంది. చెట్లూ, చేమలూ,కొండా కోన పచ్చపచ్చగా కిటికీలోంచి పలకరిస్తూ వెనక్కి వెళిపోతున్నాయి. అంతలో -

'ఇక మీరు దిగవచ్చు' అంది రైలు. ఆగేది తక్కువ సమయం కావడంతో బిలబిలమని దిగేశారు అంతా!

దిగేక ప్లాట్‌ఫారం ఏమిటన్నది చూశాక షాక్ తినేశారు! అది విజయనగరం కాదు. అనకాపల్లి! వ్వాట్! సూర్యుడు పడమట ఉదయిస్తాడా? సమ్‌థింగ్ రాంగ్!

అటు విజయనగరం వెళ్ళడానికి రైలెక్కి ఇటు సడన్‌గా అనకాపల్లిలో దిగబడి పోవడమేమిటి? అసలు ఈ మ్యాజిక్ ఎలా జరిగింది?

నాయనా ఇది మ్యాజిక్ కాదు. తమరు చెన్నై - హవురా మెయిల్ ఎక్కే బదులు హవురా - చెన్నై మెయిల్ ఎక్కేశారు. అంతే!

తాము ఎక్కవలసిన మెయిల్ రైట్ టైముకే వచ్చింది. కాని చెన్నై వెళ్ళే మెయిల్ ఆలస్యంగా ఆ సమయానికే వచ్చింది. మరి కన్‌ఫ్యూజన్! మూడవ ప్లాట్‌ఫారంలో వున్న మెయిల్‌ని ఎక్కాలి. కర్మకొలది నెంబర్ వన్ ప్లాట్‌ఫాం మీద వున్న మెయిల్ ఎక్కేశారు. పొరపాటు

జరిగిందనేది అనకాపల్లిలో దిగితేగాని తెలియలేదు! సూర్యం నీరసపడిపోయాడు. తమ కోసం వాళ్ళు ఎదురు చూస్తుంటారు. వస్తామన్న టైముకి రాకుంటే కంగారు పడతారు. జరిగిన తతంగం చెబితే పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతారు. సిగ్గు సిగ్గు. వాళ్లకి ఇంకేదో కారణం చెప్పాలనుకున్నారు.

"అదేం లేదు. మనం ముహూర్తం టైముకే విజయనగరం వెళ్తున్నాం" అన్నాడు శాంతారామ్.

"అదెలా సాధ్యం బావా" అన్నాడు వెర్రిమొహం వేసుకొని సూర్యం.

"ఏ పని అయినా పట్టుదలే తట్టి లేపుతుంది. లక్ష్యమే నడిపిస్తుంది. కమాన్" అన్నాడు శాంతారామ్. రేవతికి తన భర్త కొత్తగా, ముచ్చటగా కనిపించేడు.

టీ.సి. కళ్ళు కప్పి టికెట్‌లేని దొంగ ప్రయాణీకుల్లా బయటపడ్డారు. అక్కడ టైమ్ వేస్టు చేయకుండా ఆటోపై పెందుర్తి వైపు వెళ్ళే హైవేకి వచ్చేశారు. వెంటనే విజయవాడ నుంచి ఒరిస్సా వైపు వెళ్తున్న లారీని ఆపేడు శాంతారామ్. లారీ విజయనగరంలో ఆగేటప్పటికి సమయం సాయంత్రం పావు తక్కువ అయిదు అయింది.

"థాంక్యూ బావా" అన్నాడు సూర్యం శాంతారామ్‌తో - లారీ నుంచి దిగుతూ. సూర్యం మరికొన్ని నిముషాల్లో పల్లవిని చూడబోతున్న పారవశ్యంలో గాలిలో ఎగురుతూ ఎదురుగా వస్తున్న ఎత్తు గుండెల అమ్మాయిని ధనేల్‌మని గుద్దేశాడు. గుద్దేసి పడిపోయేడు. అమ్మాయీ పడిపోయింది. ఒకరి మీద ఒకరు అలా అమాంతంగా పడిపోకుండా తమాయించుకు నిలబడ్డారు. అమ్మాయి చేతిలో పుస్తకాలు మాత్రం పడిపోయేయి.

ఎత్తు గుండెల అమ్మాయి కింద పడిన పుస్తకాలు తీసుకుని, సూర్యం వైపు సీరియస్‌గా చూసి 'ఇడియట్' అని తిట్టి విసవిసా నడుచుకు వెళ్ళిపోయింది. "ఇడియట్ అన్నదని కుంగిపోకు. ఇదే టర్నింగ్ పాయింట్. ప్రేమకు బీజం" అని సూర్యం చెవిలో ఊదేడు శాంతరామ్. "అయ్యా! పూరీ జగన్నాథ్‌గారూ! నేను రవితేజను కాను. తమరే నాకు అటు పల్లవిని చూపిస్తున్నారు. నాకది చాలు" అని చేతులెత్తి దండం పెట్టేడు సూర్యం. మరునిముషంలో గట్టిగా అరిచేడు సూర్యం.

"బావా! అది నీవనుకుంటున్నట్టు ప్రేమపక్షి రక్షిత కాదు. నెంబర్ వన్ కిలాడీ గుంట. నా పర్స్ కొట్టేసింది."

"అమ్మ ముండో" అని శాంతారామ్ వెనక్కి పరిగెట్టేడు. సూర్యం కూడా. ఎత్తు గుండెల ఆ కిలాడీ పిల్ల వారి కళ్ళకు కనిపించకుండా మాయమైపోయింది! ఐదు నిముషాలు అటూ ఇటూ వెదికేరు. కనిపించలేదామె! "ఇంతకీ డబ్బు ఎంత పోయిందేమిటి?" అడిగేడు శాంతారామ్.

"పోవడానికి పర్సులో డబ్బులు నేను పెడితేగా! ఇలాంటివి జరుగుతాయనే ముందు జాగర్తగా తెచ్చిన డబ్బులన్నీ ఫ్యాంట్ లోపలి దొంగ పాకెట్‌లో భద్రంగా దాచేశాను" అన్నాడు సూర్యం. బావకి ఒళ్ళు మండిపోయింది భగభగ! "పర్స్‌లో పైసా లేనప్పుడు ఏదో బంగారం

పోయినట్టు నన్నెందుకు పరిగెట్టించావ్?" అన్నాడు.

"నేనేం పరిగెట్టించలేదే! నీవే పరిగెట్టావ్! పూర్తిగా విను బావా. పర్స్‌లో డబ్బు కన్నా బంగారం కన్నా విలువైనదొకటి పోయింది తెల్సా" అన్నాడు సూర్యం బాధగా. "ఏమిటి డైమండా!" అన్నాడు శాంతారామ్ వెటకారంగా.

"కాదు. అంతకన్నా విలువైన పల్లవి ఫోటో."

వీడెవిట్రా బాబూ - అని విసుక్కున్నాడు శాంతారామ్.

"నాయనా సూర్యం! మనం పరిగెట్టాల్సింది నీ పర్సులోని పల్లవి ఫొటో కోసం కాదు. ప్రత్యక్షంగా పల్లవినే చూడటానికి. కమాన్ చలో!" అని సూర్యంని పరిగెట్టించాడు. తర్వాత - అందరూ పెళ్ళివారింటికి చేరారు. పరామర్శలయ్యాక పెళ్ళి చూపుల కార్యక్రమం సీన్! గదిలో ఎంతమంది ఎవరెవరు ఉన్నా లేకున్నా సూర్యం దృష్టి అర్జునుడి బాణంలా పల్లవి మీదే వున్నది. పది నిముషాలుగా ఆమెనలా చూస్తూ ఓ మధురమైన పారవశ్యంలో ఉన్నాడు.

"తమ్ముడూ! ఇక చూసింది చాలు. పల్లవితో ఏమైనా సెపరేట్‌గా మాటాడతావా" అంది రేవతి. సీన్ హాలు నుంచి లోన గదిలోకి మారింది. గదిలో ఇద్దరే ఇద్దరు. పల్లవి, సూర్యం - ఎదురెదురుగా. సూర్యంకి ధైర్యం చాలడం లేదు. అక్క కూడా వుంటే బాగుణ్ణనుకున్నాడు. ఏమి మాటాడాలో తెలీక "మీరు అందంగా ఉన్నారు" అన్నాడు. పల్లవి నవ్వి ఊరుకుంది. 'నేనంటే నీ కిష్టమా' అనబోయి "నేనెలాగున్నాను" అన్నాడతను.

"అందంగా వున్నారు" అంది సిగ్గుతో - "ఐతే ఈనాటి ఫేషనబుల్ గెడ్డంలోనైతేనా ఇంకా బాగుంటారు"

గెడ్డాన్ని బలవంతంగా గీయించేసిన అక్క మీద ఎక్కడలేని కోపం వచ్చింది సూర్యంకి.

సీన్ గది నుంచి మళ్లీ హాలుకి మారింది. చివరి ఐటమ్ పల్లవి నృత్యం. సూర్యంకి శాస్త్రీయ నృత్యాలంటే ఎంతో ఇష్టం. సాధారణంగా కళాభారతిలో సాగే ఏ డ్యాన్సు ప్రోగ్రామ్‌ని తను మిస్ కాడు. నృత్యం చూసినప్పుడల్లా తను ఆడజన్మ ఎత్తనందుకు బాధపడ్తుంటాడు. ఈ జన్మకి ఇంతే అనుకోకుండా రేపు తనకి పుట్టబోయే కూతురికి అక్షరాభ్యాసానికి ముందే కాళ్ళకు గజ్జెలు కట్టి ఘల్లుఘల్లు మన్పించాలని నిర్ణయించుకున్నాడు గట్టిగా.

పల్లవి డ్యాన్సు చేయడానికి వీలుగా హాలు సర్దబడింది.

సూర్యం ఠీవిగా కూర్చున్నాడు. మరికొన్ని క్షణాల్లో నృత్యం తిలకించడానికి సూర్యమే కాక మిగతావాళ్ళూ ఉత్సాహంగా వున్నారు - ఒక్క అర్జున్ తప్ప! వాడికి పల్లవి ఇంట్లో స్వీట్సు, చాక్లెట్లు తప్ప మిగతా వ్యవహారాలన్నీ బోర్ కొడ్తున్నాయి. అక్కడ ఆడుకోవడానికి పిల్లలు, పిల్లులూ, కుక్కలూ కనపడలేదు. అయితే ఒక్కసారిగా వాడిలో హుషారు గోడ మీద బల్లిని చూడగానే వచ్చింది!

బల్లులంటే ఎవరికైనా భయం. అసహ్యం. అర్జున్ వాటికి అతీతుడు. బల్లులతో ఆడుకోగల మహాబలుడు. తోవ తప్పిన ఒక తూనీగ ట్యూబ్‌లైట్ వెలుగుని ఆశ్రయించింది. తూనీగపై బల్లి ఆకలి చూపులు.

తూనీగను తనకు దక్కనీయకుండా ఆటపట్టిస్తున్న అర్జున్‌పై బల్లి కొరకొర చూపులు. అంతలో టేప్ రికార్డర్ ఆన్ అయింది. పల్లవి నృత్యం ప్రారంభం ముందుగా నటరాజుకి అభినయ పూర్వకంగా నమస్కరించింది. పద్మాల్లాంటి పాదాలతో ఘల్లుఘల్లుమని గజ్జెల సవ్వడి. అంతే!

సూర్యం ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి నృత్యం చేయసాగేడు. పల్లవి చేష్టలుడిగి బొమ్మలా ఉండిపోయింది. సూర్యం అభినయం, హావభావాలు చూసి విస్తుపోయింది. ఏమిటీ తను చేస్తున్నది? శివతాండవమా? ఆనందభైరవిలో భామాకలాపమా! లేక రామరాగమాలిక రాగంలో నారాయణీయమా! కాకుంటే దశావతారాలా!

అక్కడ అర్జున్ ఒక్కడే మావయ్య డ్యాన్స్ చూసి పకపక నవ్వుతూ ఎంజాయ్ చేస్తున్నాడు. మిగతావాళ్ళకి మతులుపోయేయి. సూర్యం చేస్తున్నది ఏ నృత్యమూ కాదని, ఇంకేదో జరగరానిది జరిగిందని, అందుచేతనే కల్లు తాగిన కోతిలా కిందామీదా అయిపోతున్నాడని క్రమక్రమేణా కొన్ని క్షణాల్లోనే అర్థమవసాగింది.

ఒక స్టేజ్‌లో సూర్యం విలయతాండవం చేస్తూ ప్యాంట్‌లో టక్ చేసిన షర్టుని సర్రుమని బైటకు లాగేశాడు. తర్వాత తాళలేక ఓపలేక షర్టుని బర్రుమని చించేశాడు. తర్వాత బనీనుతో కుస్తీ! బనీను తీయడం సాధ్యం కాలేదు. షర్టు ఒంటిపై ఉండగా బనీను తీయడం అసాధ్యం. ఆ విన్యాసాలన్నీ తైతక్కలాడుతూనే! నయం! సూర్యం ప్యాంట్ విప్పే స్థాయి వరకూ వెళ్ళలేదు.

చటుక్కున అతని బుర్రలో బల్బ్ వెలిగినట్టుంది. గోడ కేసి ఆంబోతు వీపు రుద్దుకున్నట్టు, గోడని ఆక్రమించి వీపుని గోడకి అదిమిపెట్టి పై నుంచి కిందకీ, కింద నుంచి పైకి గట్టిగా రుద్దేశాడు. హమ్మయ్య! సూర్యం రిలాక్స్ అయ్యేడు. అతని ప్రాణం శాంతించింది. ఓ చిన్న ప్రాణి చచ్చి నేలపై జారింది. అది బల్లి! కెవ్వుమన్నారంతా!

అది అర్జున్ నిర్వాకం! సిసింద్రీగాడు తిన్నగా ఉండక తూనీగపై దాడి చేయబోతున్న బల్లిపై చిన్న చీపురుపుల్లతో దాడి చేశాడు. బల్లి బెంబేలెత్తిపోయి, బేలన్సు కాసుకోలేక పడిపోయింది. ఆ పడిపోవడం ఎకాఎకి విశాలంగా పరిచి వున్న సూర్యం కాలర్‌లోంచి షర్టు లోపలికి పడిపోయింది. బల్లి కంగారు. సూర్యం బేజారు.

అక్కడ ఇంకా వినిపిస్తున్నది అర్జున్ నవ్వులే. క్రమక్రమేణా అందరూ అర్జున్ నవ్వుతో శృతి కలిపారు. పల్లవి కూడా నవ్వకుండా ఉండలేకపోయింది. దాంతో సూర్యం కూడా ఏడ్వలేక నవ్వేశాడు. లాంఛనాల పర్వంలో లాభం అన్నట్టు పల్లవి తల్లిదండ్రులు సూర్యంకి కొత్త షర్టు కొనిచ్చి వైజాగ్ పంపేరు. తర్వాత పల్లవి నిచ్చి పెళ్ళి చేశారు.

కొత్త కాపురం వేరే కాపురం. పాపం సూర్యం పల్లవి నృత్యం పెళ్ళిచూపుల రోజున మిస్ కొట్టేక మళ్ళీ అతనికి ఆమె నృత్యం చూసే అవకాశం రాలేదు.

ఇప్పుడు పల్లవే రాగాలు తీస్తూ గారాలు పోతూ తన తమ్ముడు సూర్యాన్ని తకధిమ్ తకధిమ్మని డ్యాన్సు చేయిస్తున్నదని రేవతి ఆరోపణ. "సర్లే! నా స్థితి కూడా అదే కదా!" అన్నాడు శాంతారామ్ పెళ్ళాంతో. ✿